మాజీ మంత్రి హరీశ్‌రావుతో నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు

బెదిరింపులకు భయపడొద్దు

కొడంగల్, జూలై 10 : బీఆర్‌ఎస్ శ్రేణులు ఎవరి బెదిరింపులకూ భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ జడ్పీటీసీ కోట్ల మహిపాల్‌తోపాటు బీఆర్‌ఎస్ నాయకుడు చాంద్‌పాషా తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న అధికార దుర్వినియోగంపై మాజీ మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకొచ్చారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

రంగారెడ్డి డీఆర్‌డీవో శ్రీలత

మొయినాబాద్, జూలై 10 : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవంలో ప్రతి అధికారి భాగస్వాములై విజయవంతం చేయాలని రంగారెడ్డి డీఆర్‌డీవో శ్రీలత అన్నారు. గురువారం మండల పరిధిలోని చిలుకూరు గ్రామ రెవెన్యూలో ఉన్న జాతీయ మృగవని పార్కులో చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి మండలాలకు చెందిన ఎంపీడీవోలు, ఎంపీవోలు, గ్రామపంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన వనమహోత్సవంపై జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం జాతీయ మృగవని పార్కు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ప్రతిమ అవగాహన సదస్సు నిర్వహించారు. మొక్కలు నాటడానికి ఎంత లోతు గుంతలు తీయాలి, మొక్కలు నాటినప్పుడు ఎలాంటి ఎరువులు వేయాలి, వాటి సంరక్షణకు ఎలాంటి జాగ్రత్త చర్యలు తీసుకోవాలో ఎఫ్ఆర్‌వో అవగాహన కల్పించారు.

జాతీయ మృగవని పార్కులో మూడు మండలాల పంచాయతీ అధికారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఆర్‌డీవో శ్రీలత

సూచనలు, సలహాలు పాటించాలి

అవగాహన సదస్సులో పాల్గొన్న డీఆర్‌డీవో శ్రీలత మాట్లాడుతూ.. అటవీ శాఖ అధికారులు ఇచ్చిన సూచనలు, సలహాల మేరకు మొక్కలు నాటినట్లైతే మొక్కలను సంరక్షించుకోవడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. గ్రామాలవారీగా తమకు ఇచ్చిన లక్ష్యం ప్రకారం మొక్కలను నాటాలని, ఎక్కడ మొక్కలు నాటితే వాటి సంరక్షణ బాగుంటుందో స్థలం ఎంపిక చేసి ఎంపీడీవోల పర్యవేక్షణలో మొక్కలు నాటడానికి కార్యదర్శులు కృషి చేయాలన్నారు. మొక్కలు నాటడంతో తమకు ఇచ్చిన లక్ష్యం పూర్తి కాదని.. వాటిని పెద్దవిగా చేయడానికి తీసుకోవాల్సిన సంరక్షణ చాలా అవసరమని పేర్కొన్నారు. మొక్కలను పెద్ద ఎత్తున నాటడానికి అనుకూలమైన సమయమని తెలిపారు. నాటిన ప్రతి మొక్కకూ జియో ట్యాగింగ్ చేయించాలని.. ఆగస్టు చివరి నాటికి నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటాలన్నారు. పంచాయతీరాజ్, ఇరిగేషన్, అటవీ శాఖల అధికారులు క్రియాశీలకంగా భాగస్వాములు అవుతారని చెప్పారు. నూటికి నూరు శాతం మొక్కలు నాటడానికి కార్యాచరణ రూపొందించుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీవో సుభాషిణి, మొయినాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి ఎంపీడీవోలు సంధ్య, హిమబిందు, వెంకయ్యగౌడ్ పాల్గొన్నారు.

మలేరియా, డెంగ్యూ నియంత్రణకు ఫీవర్ సర్వే

జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పాల్వన్‌కుమార్

వికారాబాద్, జూలై 10 : సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ అంటు వ్యాధులను నియంత్రించేందుకు ఫీవర్ సర్వే నిర్వహించాలని జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పాల్వన్‌కుమార్ తెలిపారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రోగ్రాం ఆఫీసర్స్, పీహెచ్‌సీల వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీజనల్ డిసీజెస్ నియంత్రణకు తీసుకోవలసిన చర్యలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా మలేరియా, డెంగ్యూ, ఇతర అంటువ్యాధుల నియంత్రణకు Anti larval measures ఫీవర్ సర్వే చేయాలన్నారు. దీని ద్వారా జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి వారి రక్త పూతలు సేకరించి టీ డయాగ్నోస్టిక్స్ ల్యాబ్ ద్వారా నిర్ధారణ పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేయాలని తెలిపారు. అనంతరం వారికి తగు చికిత్స అందేలా జాగ్రత్తపడడం, దోమకాటుకు గురి కాకుండా ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రతి పీహెచ్‌సీలో రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌ను ఏర్పాటు చేయడం, అత్యవసర కేసులకు చికిత్స చేయడానికి సరిపడా బెడ్స్ రిజర్వ్ చేసుకోవడం జరుగుతుందన్నారు. అన్ని పీహెచ్‌సీలలో ఆంటీ స్నేక్ వీనం వ్యాక్సిన్ అందుబాటులో ఉంచుకోవడం, తగినంత ఓఆర్‌ఎస్ పాకెట్స్ నిల్వలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉంచుకోవాలని ఆదేశించారు. వ్యాధుల నియంత్రణకు వివిధ శాఖల సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ప్రస్తుతం చికిత్స పొందుతున్న అన్ని లెప్రసీ కేసులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా గర్భిణులకు అన్ని రకాల సేవలు అందించి సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని సూచించారు. జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించి కుటుంబ నియంత్రణ, పిల్లల మధ్య ఎడం గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. అధిక బీపీ, మధుమేహం, మానసిక సమస్యలు ఉన్నవారిని గుర్తించి వారికి ఇంటి దగ్గరే మందులు అందేలా చూడాలని తెలిపారు. ప్రతి గురువారం పాఠశాలల్లో ఐరన్ ఫోలిక్ మాత్రలు విద్యార్థులకు వేయాలని సూచించారు. జూలై 25 నుంచి ఆగస్టు 15 వరకు పాఠశాల విద్యార్థులకు, బడి బయట పిల్లలకు మెదడువాపు వ్యాధి నియంత్రణకు ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతుందన్నారు. అందుకు సంబంధించిన యాక్షన్ ప్లాన్లను సిద్ధం చేసుకోవాలని, ప్రస్తుతం జరుగుతున్న స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లో ఓఆర్‌ఎస్, జింక్ కార్నర్ పాయింట్‌లను గుర్తించాలన్నారు. పాఠశాలలు, రెసిడెన్షియల్ హాస్టళ్లలో విద్యార్థులకు పరిశుభ్రత , హ్యాండ్ వాషింగ్ గురించి అవగాహన కలిగించాలని, పరిసరాలు, కిచెన్, భోజనశాల ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రవీంద్రయాదవ్, డాక్టర్ జీవరాజ్, డాక్టర్ సాయిబాబా , జిల్లా పరిధిలోని వైద్యాధికారులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

హత్య కేసులో ఇద్దరు నిందితులకు పదేండ్ల కారాగార శిక్ష, రూ.2వేల జరిమానా

వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్/యాలాల, జూలై 10 : హత్య కేసులో ఇద్దరు నిందితులకు 10 సంవత్సరాల కారాగార శిక్షతో పాటు, రూ.2వేల జరిమానాను విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి డాక్టర్ సున్నం శ్రీనివాస్ రెడ్డి తీర్పు ఇచ్చినట్లు వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2013లో యాలాల మండలం గిరిజాపూర్ గ్రామంలో పాలివాళ్ల బోరింగ్‌లో నీళ్లు తక్కువవుతాయని పొలం వద్ద బోరింగ్ వేయుటకు బోరుమోటరును రానివ్వకపోవడంతో గొడవలు జరిగాయన్నారు. నిందితులు ఏ1 మైలారం చిన్న అంబ్రాప్ప, ఏ2 మైలారం పెద్ద వెంకటప్ప.. బాధితుడు మైలారం వెంకటప్ప, వారి కుటుంబ సభ్యులతో పలుమార్లు గొడవపడ్డారు. 2013 మే 29 తెల్లవారుజామున 4 గంటలకు బోరింగ్ వేయుటకు బోరుమోటరును నిందితులు పొలం వద్దకు తీసుకొని వచ్చారు. అది తెలిసిన మైలారం వెంకటప్ప వెళ్లగా.. ఇతడిని చంపాలని నిందితులు కట్టెలతో దాడి చేయగా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం తాండూరు ప్రభుత్వ దవాఖానకు తరలించి.. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా మృతిచెందాడు.

బాధితుడి తమ్ముడు మైలారం విజయ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అప్పటి యాలాల ఎస్ఐ నాగార్జున కేసు నమోదు చేశారన్నారు. అనంతరం అప్పటి కరణ్‌కోట్ సీఐ రవి కేసును దర్యాప్తు చేసి కోర్టు చార్జ్‌షీట్‌ను సమర్పించారు. వాదోపవాదనలు విన్న న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం నిందితులు ఏ1 మైలారం చిన్న అంబ్రాప్ప, ఏ2 మైలారం పెద్ద వెంకటప్పలకు పది సంవత్సరాల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇవ్వడం జరిగిందని ఎస్పీ తెలిపినారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా పని చేసిన పోలీసు అధికారులను ఎస్పీ అభినందించారు.

ఫార్మాసిటీ రైతులకు న్యాయం చేస్తాం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి

ఇబ్రహీంపట్నం, జూలై 10 : తాము గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఇప్పటివరకు పరిహారం తీసుకోని రైతుల నుంచి ఎవరూ భూములు తీసుకోకుండా తాము న్యాయం చేస్తామన్నారు. పరిహారం తీసుకోకుండా ఉన్న రైతుల భూముల జోలికి అధికారులెవరూ వెళ్లవద్దని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అఖిల భారత ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నంలోని ప్రజాభవన్‌లో ఫార్మాసిటీ బాధిత గ్రామాలైన నానక్‌నగర్, మేడిపల్లి, కుర్మిద్ద తదితర గ్రామాల రైతులతో వారు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఫార్మాసిటీ పేరుతో చేపట్టిన భూసేకరణలో జరిగిన అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని ప్రభుత్వాన్ని కోరుతామని వారు పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజల అభీష్టం మేరకు ముఖ్యమంత్రి స్పందించి ఫార్మాసిటీని రద్దుచేసి వాటి స్థానంలో టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. రైతులెవరూ ఆందోళనకు గురికావద్దని తెలిపారు.

చన్‌వెల్లి గ్రామంలో సర్వే చేయిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్ తదితరులు

ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాలి

- రంగారెడ్డి జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్
- చన్‌వెల్లిలో వైద్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే

చేవెళ్ల రూరల్, జూలై 10 : పరిసరాలతోపాటు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని రంగారెడ్డి జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్ అన్నారు. మంగళవారం డెంగ్యూతో చన్‌వెల్లి గ్రామానికి చెందిన మాణికేశ్వర్ చేవెళ్లలోని పట్నం మహేందర్ రెడ్డి దవాఖానలో చికిత్స పొందుతూ మరణించడంతో వైద్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్ పాల్గొని ఇంటింటికీ తిరుగుతూ దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, శుభ్రత, పరిశుభ్రతపై సిబ్బంది, ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో 100 ఇండ్లు సర్వే చేయగా.. అందులో ఏడుగురికి జ్వరం ఉన్నట్లు నిర్ధారించి వారికి తగిన మందులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్ మాట్లాడుతూ.. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, ఇండ్ల ఎదుట నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, ఆర్ఎంపీ వైద్యులు స్థాయికి మించి వైద్యం చేయకూడదని సూచించారు. కార్యక్రమంలో ఆలూరు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రఘుబాబు, సీహెచ్‌వోలు గోపాల్‌రెడ్డి, సుదర్శన్, వైద్యులు బాలకృష్ణ, బలరాం, అన్వర్, పద్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా గుర్నాథ్‌రెడ్డి బాధ్యతలు

కొడంగల్, జూలై 10 : తెలంగాణ రాష్ట్ర పోలీస్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ చైర్మన్‌ల నియామకాలు చేట్టింది. బుధవారం హైదరాబాద్‌లోని పోలీస్ కార్యాలయంలో గుర్నాథ్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని కాంగ్రెస్ శ్రేణులు అంబేద్కర్ కూడలిలో పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి గుర్నాథ్‌రెడ్డి సేవలను గుర్తించి గౌరవాన్ని అందించారని, ఇందుకుగాను సీఎంకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

నందిగామలో మహిళలతో సమావేశమైన యూపీ రాష్ట్ర బ్యాంకు మేనేజర్ల బృందం సభ్యులు

మహిళా సంఘాల పనితీరు భేష్

యూపీ రాష్ట్ర బ్యాంక్ మేనేజర్ల బృందం నందిగామ మండలంలో పర్యటన

నందిగామ, జూలై 10 : జాతీయ జీవనోపాధుల మిషన్, పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బ్యాంక్ మేనేజర్ల బృందం సభ్యులు రంగారెడ్డి జిల్లా నందిగామ, మేకగూడ గ్రామాల్లో పర్యటించి మహిళా సంఘాల పనితీరు, బ్యాంకు రుణాల చెల్లింపుల గురించి నేరుగా మహిళలతో మాట్లాడి తెలుసుకున్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని వ్యాపారాలు ఏర్పాటు చేయడం, తీసుకున్న రుణాలను సమయానికి చెల్లించడం వంటి అంశాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీపీఎం స్వర్ణలత, ఏపీఎం యాదగిరి, సీసీలు అనురాధ, రజిని, వీవోఏలు పాల్గొన్నారు.

వట్టెం నవోదయ పాఠశాల స్వాగత తోరణాన్ని ప్రారంభిస్తున్న మురళీకృష్ణయాదవ్

రూ.10 లక్షలతో స్వాగత తోరణం

షాద్‌నగర్, జూలై 10 : తాను చదువుకున్న బడికి ఏదైనా చేయాలనే సంకల్పంతో ముందడుగు వేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ తనయుడు, బీఆర్‌ఎస్ యువ నాయకుడు మురళీకృష్ణయాదవ్. నాగర్ కర్నూల్ జిల్లా వట్టెం నవోదయ పాఠశాల అభివృద్ధిలో భాగంగా సొంతంగా రూ.10 లక్షలను వెచ్చించి పాఠశాల స్వాగత తోరణాన్ని నిర్మించారు. ఇందులో భాగంగానే బుధవారం స్వాగత తోరణాన్ని ప్రారంభించారు. తన సోదరి జ్యోతి జ్ఞాపకార్థం తన వంతుగా నిర్మాణానికి పూనుకున్నానని ఈ సందర్భంగా మురళీకృష్ణయాదవ్ తెలిపారు. స్వాగత తోరణం నిర్మాణంపై పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

సాగు చేసే భూములకు రైతు భరోసాను అందించాలి

కడ్తాల్, జూలై 10 : రైతులు సాగు చేసే భూములన్నింటికి రైతు భరోసా పథకాన్ని అందజేయాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామంలో బీకేఎస్ దిల్‌సుఖ్‌నగర్ బాగ్ అధ్యక్షుడు తీగల శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం సకాలంలో పంట పెట్టుబడి సాయాన్ని అందించకపోవడంతో, రైతులు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు రుణాలు తీసుకొని వ్యవసాయం చేయాల్సి వస్తున్నదనారు. పథకం అమలులో సంఖ్యతో సంబంధం లేకుండా సాగు చేస్తున్న అన్ని భూములకు పెట్టుబడి సాయాన్ని అందించాలని ఆయన కోరారు.

మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలి

గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను వింటున్న ఏటీడీవో వెంకటయ్య

ఏటీడీవో వెంకటయ్య

కడ్తాల్, జూలై 10 : వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని జిల్లా గిరిజన సంక్షేమ సహాయ అధికారి(ఏటీడీవో) ఉడతనూరి వెంకటయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహం, ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ రికార్డులు, విద్యార్థుల హాజరు పట్టికలను ఆయన పరిశీలించారు. తరగతి గదులను పరిశీలించి ఉపాధ్యాయుల బోధనా పద్ధతులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. వసతి గృహాల్లో వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఉంటారని, వారిని కంటికి రెప్పలా కాపాడే బాధ్యత వార్డెన్లదేనని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అనంతరం ఆయన విద్యార్థులకు బెడ్‌షీట్లు, కార్పెట్లు, టవల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూవో రాములు, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు : మెనూ ప్రకారం భోజనం అందించాలని ఏటీడీవో వెంకటయ్య అన్నారు. బుధవారం సాయంత్రం ఆమనగల్లులోని గిరిజన బాలికల సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల భోజనానికి సిద్ధం చేసిన వంటకాలను ఆయన రుచి చూసి పరీక్షించారు. అనంతరం వసతి గృహంలోని గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, పరిసర ప్రాంతాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం వసతిగృహ ఆవరణలో మొక్కలు నాటి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధించాలని వసతిగృహ అధికారి రామచంద్రయ్యకు సూచించారు. విద్యార్థుల విద్యపట్ల గాని, ఆరోగ్యం పట్ల గాని, మౌలిక వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విమల, కవిత, జ్యోతి, సల్మా, కీర్తి, శాంభవి, సునీత, పద్మ, సంతోష, లక్ష్మి ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

ముడిమ్యాల ఫారెస్ట్ అభివృద్ధికి రూ.13 కోట్లు మంజూరు

తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి

చేవెళ్లటౌన్, జూలై 2 : చేవెళ్లలోని ముడిమ్యాల ఫారెస్ట్ అభివృద్ధికి రూ.13 కోట్లు మంజూరయ్యాయని తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం చేవెళ్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చేవెళ్లలోని ముడిమ్యాల అటవీ ప్రాంత అభివృద్ధికి రూ.13, మరో రూ.13 కోట్లు జాతీయ రహదారి అభివృద్ధి సంస్థకు కేటాయించడం జరిగిందన్నారు. ఈ నెలాఖరులోగా తెలంగాణ పోలీసు అకాడమీ నుంచి మన్నెగూడ వరకు నాలుగు లైన్ల బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ముడిమ్యాలలోని అటవీ శాఖ మీదుగా వన్యప్రాణులు రోడ్డు మీదికి రాకుండా అడ్డుకోవడానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సీఎం రూ.26 కోట్లు మంజూరు చేయడంతో హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు వెంకట్‌స్వామి, ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శైలజ, భీమయ్య, ప్రభాకర్, గోపాల్‌రెడ్డి, మధుసూదన్‌గుప్తా, బాలయ్య, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ రాములు, నాయకులు పాండుయాదవ్, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, మాణిక్యం, జనార్దన్ ఉన్నారు.

ఓయూలో జర్నలిస్టులపై జరిగిన పోలీసుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

- అత్యుత్సాహం ప్రదర్శించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి
- తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

షాబాద్, జూలై 10 : ఉస్మానియా యూనివర్సిటీలో విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులను అమానుషంగా పోలీసులు లాక్కెళ్లడం అప్రజాస్వామికమని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్(హెచ్‌యూజే)అధ్యక్షుడు శంకర్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు ఘటనపై స్పందించారు. బుధవారం ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. ఉస్మానియా యూనివర్సిటీలో నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనను కవర్ చేసేందుకు వెళ్లిన జీటీవీ ప్రతినిధి శ్రీచరణ్‌పై పోలీసులు అమానుషంగా ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. చొక్కా పట్టుకుని లాక్కెళ్లడమే కాకుండా, కెమెరాలను తీయొద్దంటూ బెదిరించడం దారుణమన్నారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ జర్నలిస్టుల పట్ల దాడులకు పాల్పడడం అడపాదడపా జరుగుతూనే ఉన్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనపై తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టులపై దాడులకు పాల్పడిన పోలీసుల పట్ల చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

ఆమనగల్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్

కస్తూర్బా గాంధీ పాఠశాల భవనాన్ని వెంటనే ప్రారంభించాలి

డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్

ఆమనగల్లు, జూలై 10 : కడ్తాల్‌లో నిర్మించిన కస్తూర్బా గాంధీ పాఠశాల భవనాన్ని వెంటనే ప్రారంభించాలని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరారు. ఆమనగల్లులో బుధవారం నిర్వహించిన ప్రభుత్వ దవాఖాన భూమి పూజా కార్యక్రమంలో పాల్గొన్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిసి పాఠశాల భవనాన్ని ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.3.50 కోట్లతో కస్తూర్బాగాంధీ పాఠశాల నిర్మించడం జరిగిందని, గతంలో ఈ పాఠశాల అద్దె భవనంలో కొనసాగేదని.. ఆ భవనాన్ని ఇటీవల భవన యజమాని ఖాళీ చేయించడంతో భవనం లేక పాఠశాల విద్యార్థులు కొంతమంది కందుకూరు, కొంతమంది ఆమనగల్లు కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారన్నారు. విద్యార్థుల సమస్యను దృష్టిలో ఉంచుకొని వెంటనే పాఠశాల భవనాన్ని ప్రారంభించాలని ఆయన కోరారు.

మత్తులో యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు

నందిగామ, జూలై 10 : యువత, విద్యార్థులు డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని యాంటీ నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో సాయిచైతన్య అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని సింబియాసిస్ యూనివర్సిటీలో బుధవారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాయిచైతన్య హాజరై మాట్లాడారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సంతోష్ అగావ్, పోలీస్ ఉన్నతాధికారులు, అధ్యాపకులున్నారు.

బోనాల వేడుకల్లో ఒగ్గు కళాకారులు

బొంరాస్‌పేట, జూలై 10 : దేశ రాజధాని న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన బోనాల వేడుకల్లో రాష్ట్రానికి చెందిన ఒగ్గు కళాకారులు పాల్గొని తమ ఒగ్గు కళను ప్రదర్శించారు. బోనాల ఉత్సవాల్లో భాగంగా బుధవారం మహంకాళి అమ్మవారికి బంగారు బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పాల్గొన్నారు. తెలంగాణ భవన్ ఆవరణలో ఒగ్గు కళాకారులు, పలువురు మహిళలు బోనాలు ఎత్తుకుని చేసిన కళా ప్రదర్శనను గవర్నర్ తిలకించి కళాకారులను అభినందించారు. అనంతరం వారితో గ్రూప్ ఫొటో దిగారు. బోనాల వేడుకల్లో వికారాబాద్ జిల్లా నాందార్‌పూర్‌కు చెందిన మల్లికార్జున ఒగ్గు కళ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బీరప్ప పాల్గొన్నారు.



ఢిల్లీలోని తెలంగాణ భవన్ ఆవరణలో ఒగ్గు కళాకారుల ప్రదర్శన